సాగర్‌లో సందడి




నాగార్జునసాగర్‌లోని సందర్శన స్థలాలు పర్యాటకులతో సందడిగా ఉంది. ఆదివారం సెలవురోజు కావడం సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల జరుగుతుండడంతో ఆ సుందర దృశ్యాన్ని తిలకించడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. అలా వచ్చిన పర్యాటకులతో లాంచీ స్టేషన్, విద్యుత్‌కేంద్రం, బుద్ధవనం ప్రాంతాలు కళకళలాడాయి. హిల్‌కాలనీ నుంచి నాగార్జునకొండ మూడు ట్రిప్పులు లాంచీ రాకపోకలను నిర్వహించినట్లు లాంచీ స్టేషన్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నాగార్జునసాగర్

నవంబరులో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన నవంబరు మూడో వారంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అనే ప్రధాన అంశంతో ఉప అంశాలుగా ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణిత నమూనా, గణిత ఆలోచన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏదైనా ఒక అంశంపై ప్రాజెక్టులు తయారు చేసుకుని ప్రదర్శన పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి జిల్లాకు 114 అవార్డులు మంజూరయ్యాయి. ఎంపికైన అవార్డులకు ఒకో ఖాతాలో 10వేలు జమచేసినట్లు వివరించారు. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు ప్రాజెక్టుతో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పోటీలో పాల్గొనే విద్యార్థులకు వారి గైడ్ టీచర్ల సహకారంతో ప్రాజెక్టులు సిద్ధం చేసుకుని పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

చిన్నారిని చేయొద్దు.. పెళ్లికూతురు..!



రెండేళ్ల క్రితం కొండమల్లేపల్లి మండలంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులపై తల్లిదండ్రులు తిరగబడ్డారు.

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న తండాలు, మారుమూల గ్రామాల్లో నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లేమి, మూఢ నమ్మకాలతో పదో తరగతి, ఇంటర్ పూర్తి కాగానే బాల్య వివాహాలు చేస్తున్నారు. నల్గొండ జిల్లాలోని డిండి, చందంపేట మండలాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. సమాజంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడడం లేదు. మారుమూల గ్రామాలు సైతం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్న నేటి తరుణంలో సైతం నిత్యం బాల్య వివాహాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా వందకు పైగానే బాల్య వివాహాలను అధికారులు అడ్డుకుంటున్నప్పటికీ.. గుట్టు చప్పుడు కాకుండా జరిగేవి మరెన్నో ఉంటున్నాయి.



మిర్యాలగూడ: ఆలగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మమత(పాత చిత్రం)

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..



బాల్య వివాహాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం 141 పేజీల తీర్పులో పలు మార్గదర్శకాలు జారీ చేసింది. చిన్నారుల జీవన, విద్య, ఆశలు, ఆరోగ్యం, హక్కులను చిదిమేసే బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాహుముఖ కార్యాచరణ చేపట్టాలని సూచించింది. బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు.. ఈ కార్యక్రమంలో కలెక్టర్లు, ఎస్పీలను భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్..



బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం **1098** టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం..

– కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ



బాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లోని విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. బాలికలను విద్యాసంస్థల్లో చేర్పడం, జిల్లా కేంద్రంలోని బాల సదన్‌కు పంపడం వంటి చర్యలు చేపడతాం.

ఉమ్మడి జిల్లాలో 2020 నుంచి అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు.. (2024 అక్టోబరు వరకు)

జిల్లా	2020	2021	2022	2023	2024
నల్గొండ	50	42	41	43	17
సూర్యాపేట	72	55	72	35	43
యాదాద్రి	26	22	14	21	12

అనారోగ్య సమస్యలు: – డాక్టర్ జీవనజ్యోతి, మిర్యాలగూడ



బాల్య వివాహాల వల్ల బాలికలకు హార్మోన్ల అసమతౌల్యతతో పాటు శారీరక, మానసిక సమస్యలు ఏర్పడతాయి. సరైన అవగాహన లేకుండా గర్భం దాల్చడం వల్ల రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలతో పాటు మానసిక పరిపక్వత లేకపోవడంతో భార్యభర్తల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునే ప్రమాదం సైతం ఉంది.

పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక

మరమ్మతులతో సరఫరాకు అంతరాయం

రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రించడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోంది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది.

మంత్రి కోమటిరెడ్డి చొరవతో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కిపైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. పరికరాల కొరతను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు సీఎండీతో చర్చించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డి చొరవతో 250 వరకు నియంత్రికలు అందజేస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఈ మేరకు ఇటీవల వంద ట్రాన్స్‌ఫార్మర్లు నల్గొండ జిల్లాకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంకా 900లకు పైగా విద్యుత్తు నియంత్రికలు తక్షణం అవసరం ఉంది.

రైతుల నిరీక్షణ..!

రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

అవసరం ఉంటే తెప్పిస్తాం

వెంకటేశ్వర్లు, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్

కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. పూర్తి వివరాలు తెలుసుకుంటాం. విద్యుత్తు పరికరాల నిల్వలపై, కొరతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తా. నియంత్రికలు, ఏబీస్విచ్‌లు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపిస్తాం. ఉన్నతాధికారులతో చర్చించి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

కొనసాగుతున్న మూసీ నీటి విడుదల

కేతేపల్లి, న్యూస్‌టుడే: గడిచిన ఐదారు రోజుల నుంచి మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరద నీరు వస్తోంది. జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో ఆదివారం అధికారులు నాలుగు క్రస్టుగేట్లను ఎత్తి దిగువమూసీలోకి నీటిని విడుదల చేశారు. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ఆదివారం రాత్రి వరకు 643.60 అడుగుల గరిష్ఠ స్థాయికి నీటిమట్టం పెరిగింది. మూసీ ప్రాజెక్టు ఇంజినీర్లు డ్యామ్ నాలుగు క్రస్టుగేట్లను ఒక అడుగు ఎత్తుమేర లేపి దిగువకు నీటిని విడుదల చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు, ఎగువ ప్రాంతాలైన ఆలేరు, బిక్కేరు తదితర ప్రాంతాల నుంచి వరదనీరు వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ఆదివారం రాత్రివరకు రిజర్వాయర్‌లో 4.10 టీఎంసీల నీరు నిలువ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 1429 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రధాన కుడి, ఎడమ కాలువల ద్వారా 216 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని డ్యామ్ ఇంజినీర్ డి.ఉదయ్‌కుమార్ తెలిపారు. గేట్లు, కుడి, ఎడమ కాలువలు, ఆవిరి, సీపేజీ, లీకేజీ, రిజర్వాయర్‌కు పెట్టిన మోటార్ల ద్వారా మొత్తం 2873 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతుంది. దిగువ మూసీకి అధిక మొత్తంలో నీరు విడుదల చేసినందున ఏటి పరివాహక గ్రామాల పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, మత్స్యకారులు ఏటిలోకి వెళ్లవద్దని సూచించారు.



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళుతున్న నీరు

నేటి నుంచి సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం పర్యటన



సి.నారాయణరెడ్డి కలెక్టర్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అధ్యయనం నిమిత్తం 21 మంది సివిల్ సర్వీసెస్ ప్రొబెషనరీ అధికారుల బృందం సోమవారం నుంచి వారం రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. వారి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డా.మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 28 వరకు జిల్లాలోని పీఏపల్లి మండలం రంగారెడ్డిగూడెం, చింతపల్లి మండలం జర్పులతండా, దేవరకొండ మండలం కర్నాటిపల్లి, కొండమల్లేపల్లి మండలం ఇస్లావత్ తండా, పెండ్లిపాకల గ్రామాల్లో సివిల్ సర్వీసెస్ అధికారుల బృందం పర్యటించనున్నట్లు చెప్పారు. ఒక్కో గ్రామానికి ఐదుగురు అధికారుల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామానికి సంబంధించి సమాచారం, గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి పూర్తి సమాచారం తయారు చేసి వారికి అందజేయాలన్నారు. 24వ తేదీ వరకు వారికి కేటాయించిన గ్రామాల్లోనే బసచేస్తారని తెలిపారు. 25న అదే మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలో అధ్యయనం చేస్తారని, 26, 27 తేదీల్లో దేవరకొండ, నాగార్జునసాగర్ పురపాలికల్లో అధ్యయనం చేస్తారని వివరించారు. 28న నల్గొండలో తనతో సమావేశమవుతారని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వదిలి పరస్పరం విమర్శలు చేసుకోవడంతోనే కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. నల్గొండలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ మహాసభలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక చట్టాలు అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి పట్టణ ప్రాంతాలకు విస్తరింపచేయాలని డిమాండ్ చేశారు. ఇందులో సీపీఎం నాయకులు కుంభం కృష్ణారెడ్డి, హాశం, నారాయణరెడ్డి, సలీం, సత్తయ్య, పద్మ, నరసింహ, సరోజ, మధుసుదన్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. నల్గొండ సీపీఎం పట్టణ కార్యదర్శిగా దండెంపల్లి సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం (టీజీసీపీఎస్ఈయూ) నల్గొండ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక లెక్చరర్స్ భవన్‌లో టీజీసీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గసమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కొరివి కృష్ణ, ప్రధానకార్యదర్శిగా నారబోయిన లింగస్వామి, కోశాధికారిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, ప్రవీణ్, జాయింట్ సెక్రటరీగా అనీల్, అసోసియేట్ అధ్యక్షుడిగా దామెర శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీసీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లపుదాసు భూలక్ష్మి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శిరందాసు రామదాసు, వంగూరి నారాయణయాదవ్, వోలి సమీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ఉపయోగించుకోవాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నల్గొండలోని తితిదే కల్యాణ మండపంలో రాష్ట్ర హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో-2024 సందర్భంగా చేనేత, జౌళిశాఖ వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించనున్న చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు అన్నారు. నల్గొండలో ఆదివారం చేనేత వస్త్ర పదర్శన, అమ్మకాలను ప్రారంభించి మాట్లాడారు. ఇందులో పాల్గొన్న తయారుదారులకు వసతితో పాటు కరెంటు ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నారు. బయటి మార్కెట్ కన్న తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చన్నారు. శాఖ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇందులో కొనుగోలు చేసిన వస్త్రాలకు 30 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఇందులో చేనేత, జౌళిశాఖ ఏడి ద్వారక్, డీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో వస్త్రాలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు, తదితరులు

ఐటీఐలో 7వ దశ ప్రవేశాలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ నర్సింహ్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సీటు కేటాయించని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రైవేట్‌లోనే ఎంఆర్ఐ

జిల్లా కేంద్రంలోని రామగిరి ప్రాంతానికి చెందిన వెంకట్‌రెడ్డికి వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యులు మెదడు పనితీరుపై ఎంఆర్ఐ పరీక్ష రాశారు. ఆసుపత్రిలో పరీక్షకు యంత్రం లేని కారణంగా ప్రకాశంబజార్‌లోని ఓ ప్రైవేటు సెంటర్‌కు వెళ్లడంతో రూ.12వేలు ఖర్చు చేయాల్సి వచ్చినట్లు బాధితుడి బంధువులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో నిత్యం పదుల సంఖ్యల్లో జరుగుతున్నాయి.

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో వైద్యకళాశాలలు అందుబాటుల్లో ఉన్నా పేద ప్రజలకు అనుకున్న స్థాయిల్లో వైద్య సేవలు అందడం లేదు. కొన్ని చోట్ల యంత్రాలు ఉన్నా వాటిని ఉపయోగించే ప్రత్యేక వైద్యులు అందుబాటుల్లో లేరు. కీలక సమయాల్లో రోగ నిర్ధారణకు దోహదపడే ఎంఆర్ఐ పరీక్షలు ఎక్కడా లేక పోవడంతో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోంది. ఎంఆర్ఐ యంత్రాలు లేని కారణంగా బ్రెయిన్, వెన్నెముక , ఫిట్స్, పక్షవాతం, మోకాళ్ల నొప్పుల బాధితుల పరిస్థితి దయనీయంగా ఉంది. జనరల్ ఆసుపత్రులకు వచ్చే బాధితులు పేద మధ్య తరగతి వారే ఎక్కువగా ఉండటంతో ఎంఆర్ఐ పరీక్షలకు అయ్యే ఖర్చులు భరించలేని పరిస్థితి ఉంది. ప్రైవేటు సెంటర్లకు వెళ్లే బాధితులు పరీక్షల కోసం రూ.6వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా జనరల్ ఆసుపత్రుల ఉన్నత స్థాయి అధికారులు స్పందించి యంత్రాలతో పాటు క్యాథ్‌ల్యాబ్‌లు అందుబాటుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉర్సులో కిక్కిరిసిన భక్తజనం

నీలగిరి, న్యూస్‌టుడే: సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ఉర్సు సందర్భంగా భక్తులు దర్గాను దర్శించుకోవడానికి ఆదివారం బారులు తీరారు. గుట్టపైకి ఎక్కలేనివారు మెట్ల వద్దగల గద్దెలకు దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉర్సులో పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన మినీ జాయింట్ వీల్, జారుడు బండ, ఊయల ఊగుతూ ఉత్సాహంతో తిరుగుతున్నారు. ఉర్సులో ఏర్పటు చేసిన వివిధ వస్తువులు కొనుగోలు చేయడానికి కుటుంబ సమేతంగా జనం తరలి వస్తున్నారు.



సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రీ దర్గా దర్శనం కోసం వచ్చిన భక్తులు

టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!



చివ్వెంల కొనుగోలు కేంద్రంలో ధాన్యం దిగుమతి చేస్తున్న దృశ్యం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు.

తేమ శాతం 17 వస్తేనే జారీ

నిబంధనలు ఇలా..

- ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు.
- మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు.
- 17 శాతం తేమ వచ్చిన తరువాత సంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు.
- దాని ప్రకారం ధాన్యాన్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	కేంద్రాలు
నల్గొండ	366
సూర్యాపేట	266
యాదాద్రి	275



అవకతవకలకు చెక్!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

రైతులు ఏం చేయాలంటే..?

- ❑ రైతు తన వెంట ఆధార్ కార్డు, పట్టా పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం నకలును రెండు సెట్లు తీసుకురావాలి.
- ❑ కౌలు రైతు మండల వ్యవసాయ అధికారుల వద్ద పేరు నమోదు చేసుకోవాలి.
- ❑ ఆధార్, పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేయించుకోవాలి.
- ❑ అప్పుడే ధాన్యం కాంటా పూర్తయిన రెండ్రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

పారదర్శకంగా చేపట్టేలా ఆదేశాలు

– పద్మ, డీసీవో, సూర్యాపేట

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం. పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. తేమ శాతం వచ్చిన రైతులకు మాత్రమే టోకెన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!



గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటి పెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలూమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చు రేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది.

◆ గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట వేస్తున్న యువకులు

ఇస్తాళాపురంలో మొదలై..

మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహాసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు.

★ ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష పార్టీలు, అధికారులకు, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

★ పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామపెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

ఉల్లంఘిస్తే జరిమానా

– ఇరుగు కృష్ణకుమార్, మహాసేన యువజన సంఘం, ఇస్తాళాపురం



మా గ్రామంలో 2015 నుంచి మద్యపాన నిషేధం అమలులో ఉంది. ఈ మధ్యకాలంలో కొందరు నిషేధాన్ని ఉల్లంఘిస్తే వెంటనే స్పందించి జరిమానా విధించాం. గ్రామస్థుల సహకారంతో ఇప్పటికీ కట్టుబాట్లను కఠినంగా అమలు చేస్తున్నాం.

పుస్తెలతాళ్లు కుదువపెడుతున్నారు

– మడ్డి శివ, సర్దార్ యువజన సంఘం, గట్టికల్



మద్యం విచ్చలవిడిగా దొరకడంతో మా గ్రామంలో అర్ధరాత్రి జనం తిరుగుళ్లు ఎక్కువయ్యాయి. గొడవలు, కొట్లాటలు పెరిగాయి. చివరకు భార్యల పుస్తెలతాళ్లు కుదువపెట్టే పరిస్థితి దాపురించింది. తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని అమాయకులు చనిపోయారు. యువజన సంఘాలంతా ఏకమై మద్యపాన నిషేధ ఉద్యమంలో పాలుపంచుకున్నాం. గొలుసు దుకాణాలను పూర్తిగా మూసివేయించాం.

అమ్మ తినిపించాల్సిందే.. నాన్న ఎత్తుకోవాల్సిందే

మానవీయం



ఊదరి రమణకు గోరు ముద్దలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: అమ్మ.. చిన్నతనంలో అందరి పిల్లల్లా అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని, బుడిబుడి నడకలతో ఇల్లంతా సందడి చేసింది. మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు కాలినడకనే వెళ్లొచ్చేది. ఓ రోజు బడికి వెళ్తూ కాళ్లు అల్లుకుపోయి కింద పడిపోయింది. బిడ్డకేమైందోనని అయోమయంలో ఆ తల్లిదండ్రులు డాక్టర్లకు చూపించారు. చికిత్స కోసం అప్పులు చేసి రూ.నాలుగు లక్షలు ఖర్చు చేశారు. నయం కాకపోగా.. క్రమంగా కాళ్లు, చేతులు, శరీరం చచ్చుబడిపోవడంతో చదువు మాన్పించారు. ఆమెకు కండరాల క్షీణత వ్యాధి వచ్చిందని, చికిత్స ఏమీ లేదని వైద్యులు తేల్చి చెప్పడంతో ఆ కన్నవారి గుండె పగిలిపోయింది.

పదో తరగతిలో ఉండగా..

చౌటుప్పల్ పురపాలిక పరిధి లింగారెడ్డిగూడానికి చెందిన ఊదరి యాదమ్మ, ఊషయ్యలకు ముగ్గురు సంతానం. తమ పిల్లలు తమలాగా పారిశుద్ధ్య కూలీలుగా మారకూడదని ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. అక్కడ అయిదో తరగతి పూర్తయ్యాక మూడు కిలోమీటర్ల దూరంలో చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అక్కాచెల్లెళ్లు కలిసికట్టుగా బడికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరేవారు. పదో తరగతి చదువుతున్న పెద్దమ్మాయి రమణ ఓ రోజు ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కింద పడిపోయింది. అప్పటి నుంచి ఆమె కోలుకోలేదు.

నేటికీ అందని 'ఆసరా'

రెక్కాడితేనే డొక్కాడే ఆ నిరుపేద తల్లిదండ్రులు గత పదిహేనేళ్లుగా కదల్లేని తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం ముప్ఫయ్యేళ్ల వయసున్న రమణ కనీసం చేతితో అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకోలేని, శరీరం కదిలించలేని స్థితిలో ఉన్నారు. తల్లిదండ్రులే గోరు ముద్దలు తినిపిస్తున్నారు. కూలి మానుకుని అమ్మో, నాన్నో సాయంగా ఉంటున్నారు. తమ కుమార్తె నూరుశాతం దివ్యాంగురాలని 'సదరం' ధ్రువపత్రం జారీ చేసి పదకొండేళ్లవుతోందని, దరఖాస్తు చేసినా 'ఆసరా' పింఛను మంజూరు కాలేదని ఆ తల్లిదండ్రులు కన్నీరుపెడుతున్నారు.

చదువు ఇష్టం లేక విద్యార్థిని బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చదువు ఇష్టం లేదని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన ఘటన మిర్యాలగూడ పరిధిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. దామరచర్ల మండల పరిధిలోని ఓ తండాకు చెందిన బాలిక(14) పట్టణంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలిక.. తిరిగి ఈ నెల 18న మధ్యాహ్నం తండ్రితో కలిసి పాఠశాలకు వచ్చింది. సాయంత్రం తనకు కళ్లు తిరుగుతున్నాయని.. తోటి విద్యార్థులకు చెప్పగా వారు స్టాఫ్ నర్సుకు సమాచారం అందించారు. ఈ క్రమంలో తాను ఇంటి వద్ద పురుగు మందు తాగి వచ్చానని తెలపడంతో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి.. అక్కడి నుంచి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహానికి అక్కడే మరణోత్తర పరీక్షలు నిర్వహించి.. తల్లిదండ్రులకు అప్పగించారు. గిరిజన కులాల ఆర్సీవో అగస్టీన్.. విద్యార్థిని మృతిపై కలెక్టర్‌కు నివేదిక అందించారు. తన కుమార్తెకు చదువు ఇష్టం లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు బాలిక తల్లి స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక తాను పాఠశాలకు వెళ్లనని చెప్పటంతో నచ్చజెప్పి పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటి వద్దే ఎవరికీ తెలియకుండా పురుగు మందు తాగి పాఠశాలకు వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన..

నల్గొండ నేరవిభాగం: మిర్యాలగూడలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. పలు సంఘాల సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న అవుట్‌పోస్టు పోలీసులు ఆందోళన విరమింపజేశారు. తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పత్తి విక్రయానికి సాంకేతిక సాయం

★ యాప్‌లో కొనుగోలు కేంద్రాల సమాచారం

ఆలేరు, న్యూస్‌టుడే: మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారం అందించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాట్సప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంటోంది. సీసీఐ కేంద్రాలకు వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపులు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలుస్తుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యలతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది?, అక్కడ సరకు విక్రయించడానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను సైతం రైతులు ముందుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

రైతులు చేయాల్సిందిలా..

- సీసీఐ పత్తి విక్రయాలకు చరవాణి నెంబరు 88972 81111 సేవ్ చేసుకోవాలి.
- ఈ నెంబరుకు వాట్సప్‌లో 'హై(హెచ్ఐ)' అని టైపు చేయాలి. వన్‌సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ యాప్ ఓపెన్ అవుతుంది.
- ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషను ఎంచుకోవాలి.
- పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం కనిపిస్తాయి.
- ఆ రైతు నుంచి సీసీఐ ఎన్ని క్వింటాళ్ల పత్తి కొంటుందో చూపుతుంది.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఈ ఏడాది వానాకాలంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇది గతేడాది కన్నా సుమారు 60 వేల ఎకరాలు ఎక్కువ. ఎకరాకు సుమారు 8-14 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడిగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

భార్యకు పురుగు మందు ఇచ్చి తాగిన భర్త మృతి

◆ కుమార్తె పెళ్లైన నాలుగు రోజులకు ఘటన



బడుగుల వెంకటయ్య

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కుమార్తె వివాహం జరిగి నాలుగు రోజులు కూడా గడవకముందే తీరని విషాదం నెలకొంది. పెళ్లికూతురు తండ్రి తన భార్యకు పురుగు మందు తాగించి.. తానూ తాగిన ఘటనలో ఆయన మృతిచెందగా.. ఆమె ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటన గుర్రంపోడు మండలం మొసంగి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడుగుల వెంకటయ్య(45), జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు రమణ, లలిత, కుమారుడు రామాంజనేయులు ఉన్నారు. ఈనెల 16న తన పెద్ద కుమార్తె రమణ వివాహం చిల్కాపురం గ్రామానికి చెందిన యువకుడితో జరిపించారు. 19న సత్యనారాయణస్వామి వ్రతంలో వెంకటయ్య, జ్యోతి దంపతులు పాల్గొని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వచ్చారు. ఉదయం బయటికెళ్లిన వెంకటయ్య మధ్యాహ్నం రెండింటికి ఇంటికి రావటంతో భార్య మందలించారు. 'మొన్ననే కుమార్తె పెళ్లి జరిపించాం.. నీవు ఇలా తాగుతూ కాలం గడిపితే ఎలా' అంటూ అరిచారు. వెంకటయ్య ఆమెకు తెలియకుండా పురుగు మందు కలిపిన కూల్‌డ్రింక్‌ను ఆమెకు ఇచ్చి తాగు అంటూ తానూ దాన్ని తీసుకుని ఓ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు. ఎంతకీ వెంకటయ్య బయటికి రాకపోయేసరికి అనుమానించిన భార్య కిటికీలోంచి చూడగా వెంకటయ్య అపస్మారక స్థితిలో ఉండటం గ్రహించి బంధువులను పిలిచారు. అతన్ని నల్గొండలోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. కొంత సమయానికి జ్యోతి కడుపులో కూడా తిప్పటం మొదలవగానే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలోని వార్డుకు తరలించారు. వెంకటయ్య మృతదేహాన్ని అక్కడే శవాగారంలో భద్రపరిచారు. ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి చికిత్స పొందుతున్న జ్యోతిని పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం




జానకిరాములు

చివ్వెంల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని నాల్గో వార్డు ఖాసీంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందుల జానకిరాములు(50) గ్రామంలోని ఓ రైతు పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. పొలంలోకి దిగి మందు పిచికారీ చేస్తుండగా.. అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్తు తీగను గమనించక తొక్కడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. పక్కనే ఉన్న రైతు మద్ది శ్రీనివాస్ అతన్ని కాపాడేందుకు ప్రయత్నించగా.. అతనికి సైతం గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీగ తెగిపడినా మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు శివ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కనకరత్నం తెలిపారు.

యాదాద్రి ఆలయ పరిసరాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల రీల్స్ చేసిన దృశ్యాలు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆయన సతీమణి, కుమార్తె జన్మదినం సందర్భాల్లో కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి వీడియోలు చిత్రీకరించుకున్నారు. కుమార్తెతో ఆలయ ప్రాంగణంలో రీల్స్ చేయించారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఆయన ఇలా రీల్స్ చేయడం సరికాదని భక్తులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఈవో భాస్కర్‌రావు వివరణ కోరగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆలయంలో చిత్రీకరణ కోసం అనుమతి కోరగా ఇవ్వలేదని, ఆలయం బయట సాధారణ భక్తుల మాదిరిగా తీసుకోవచ్చని సూచించామని ఈవో వివరించారు.

కాచరాజుపల్లి సొగసు చూడతరమా!



ఓ పక్క కృష్ణా వెనుక జలాలు.. మరోవైపు భూమికి పచ్చని రంగేసినట్లు పైర్లు. వీటి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరారుతోంది.. కాచరాజుపల్లి. చందంపేట మండలంలో కృష్ణా నది ఒడ్డున ఈ గ్రామం ఉంది. ఆరునెలల పాటు కృష్ణా జలాలు, మరో ఆరు నెలలు బీడు పట్టి ఉండటం ఆ గ్రామ ప్రత్యేకత. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు చేపల వేటకు వెళ్తుండగా.. మహిళలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం.. మధ్యలో కృష్ణా వెనుక జలాలు, పచ్చని పైర్లు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ ఆధ్యాత్మిక కేంద్రాలూ ఉండటంతో దర్శనానికి వచ్చిన భక్తులు, పర్యాటకుల సందడి రోజురోజుకూ పెరుగుతోంది.

– చందంపేట, న్యూస్‌టుడే:

ఆరు తరాలు.. 141 కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం



మట్టపల్లిలో వంశ వృక్షం వేదికగా కలిసిన కుటుంబ సభ్యులు

బంధాలను చరవాణిలకే పరిమితం చేసి బంధువులు సైతం ఒకరినొకరు పరిచయం చేసుకునే దుస్థితికి దిగజారిన ప్రస్తుత రోజుల్లో ఆరు తరాలకు చెందిన 141 కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాలలోని బంధు గణమంతా కదిలివచ్చి అస్మదీయుల అభిమానానికి పాత్రులయ్యారు. 300లకు పైగా ఈ సమ్మేళనానికి హాజరై తమ అపూర్వ కలయికకు మూలమైన వంశాధిపతి దంపతులకు నివాళి అర్పించి అనంతరం జరిగిన ఆత్మీయ వేడుకలో పాలు పంచుకున్నారు. నాలుగు దశాబ్దాల కిందట దివంగతులైన నేరేడుచర్లకు చెందిన రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం మట్టపల్లి క్షేత్రంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం వారి వంశవృక్షం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వీరి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెల ఆరు తరాల సంతానం (ముది మనవళ్లు, వారి మనవళ్లు) 411 మంది కాగా మూడు వందలకు పైగా ఇక్కడి వేదికపై కలుసుకున్నట్లు పరిచయకర్త రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. శ్రీనాథ్, నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు స్ఫూర్తిదాయక సమ్మేళనంలో కీలకంగా వ్యవహరించారన్నారు.

- మఠంపల్లి, న్యూస్‌టుడే:

బాలల పరిరక్షణాధికారి విచారణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో ఓ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించగా బాలల పరిరక్షణాధికారి సైదులు ఆదివారం విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కోర్టు ఉద్యోగి(ఆఫీస్ సబార్డినేట్) ఒకరు ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలల పరిరక్షణాధికారికి ఫిర్యాదు చేసింది. ఆయన విచారణ జరపగా బాలసదన్ సిబ్బంది అలాంటిది ఏం జరగలేదని చెప్పగా సదరు బాలిక తనపై బ్యాడ్ టచ్ చేసిన మాట వాస్తవమని చెప్పింది. బాలల సంరక్షణ సమితి, బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాలసదన్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తున్నాయి.

పల్లె దవాఖానాలకు సొంత భవనాలెప్పుడో..?



ప్రైవేటు భవనంలో నడుస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలకు సొంత భవనాల నిర్మాణాల్లో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ సేవలందిస్తున్నారు. మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా ..గ్రామాల వారంతా సాధారణ జ్వరాలకు ఇక్కడికి వచ్చేందుకు దూరం అవుతుండటంతో ప్రభుత్వం పల్లెదవాఖానాలను, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించింది. వీటిని ఆయా గ్రామాల వాసులకు అనుకూలంగా ఉండేలా ఎంపిక చేసి మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, టీఎస్ఎంఐడీసీ నిధులతో నిర్మాణాలు చేయాలని నిర్ణయించారు. జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఉన్నతాధికారులు స్పందించి పల్లెదవాఖానాల నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలి గ్రామాల వాసులు కోరుతున్నారు. మంజూరైనా పల్లెదవాఖానాల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూస్తామని జిల్లా ఉపవైద్యాధికారి గీతావాణి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఆసుపత్రుల పరిస్థితి:

★ నల్గొండ జిల్లాలో మొత్తం పల్లెదవాఖానాలు 164 మంజూరయ్యాయి. 80 పల్లెదవాఖానాలకు నిధులు విడుదల చేశారు. కాగా వీటిలో కొన్ని ప్రారంభం కాగా, మిగతావి అసంపూర్తిగా ఉన్నాయి. 24 టీఎస్ఎంఐడీసీ నిర్మించాల్సి ఉండగా నిధులు విడుదల కాలేదు. మిగతా 60 పల్లెదవాఖానాలకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు కేటాయించాల్సి ఉంది.

★ సూర్యాపేట జిల్లాలో 109 పల్లె దవాఖానాలు మంజూరు కాగా కేవలం 29 భవనాలకు మాత్రమే నిధులు కేటాయించారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయించగా ఈ నిధులు సరిపోవని, పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మిగతా 80 భవనాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

★ యాదాద్రి జిల్లాలో 99 పల్లె దవాఖానాలు మంజూరు కాగా.. వీటిలో భవనాలు ఉన్నవి 36. మిగతా 63 భవనాలకు నిధులు కేటాయించగా.. ఇప్పటి వరకు నిర్మాణాలు మాత్రం ప్రారంభం కాలేదు.



ప్రారంభానికి నోచుకోని జప్తివీరప్పగూడెం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం

ఆంగ్లం అర్థం కావడం లేదని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కోదాడ, చిలుకూరు, న్యూస్‌టుడే: పుట్టినప్పటి నుంచి మాతృభాష తెలుగులో చదివి, ఇంటర్ వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం కావడంతో చదువు అర్థం కాక ఓ విద్యార్థి తనువు చాలించిన ఘటన చిలుకూరు మండలంలోని ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి(17) చిలుకూరు మండల కేంద్రంలోని కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. దసరా సెలవులు ముగియడంతో అతన్ని తన మేనమామ కళాశాలకు తీసుకొచ్చారు. కళాశాల యాజమాన్యం ఆ విదార్థికి మార్కులు తక్కువగా వస్తున్నాయని మేనమామ దృష్టికి తీసుకొచ్చి మందలించింది. ఆంగ్ల మాధ్యమంలో సబ్జెక్టులు అర్థం కావట్లేదని ఎవరికీ చెప్పుకోలేక మనస్తాపానికి గురైన విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరి వేసుకున్నారు. కళాశాల సిబ్బంది గమనించి కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంట క్రితమే కళాశాలకు పంపించామని, అంతలోనే మృతి చెందడం ఏంటనీ బంధువులు ఆరోపిస్తున్నారు. తమలాగా కూలీ పనులు చేయకుండా, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తాడనుకున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిలుకూరు ఎస్సై రాంబాబు తెలిపారు.

★ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో మేనమామ కళాశాలలో దింపేందుకు వాహనంపై విద్యార్థిని తీసుకొచ్చారు. 'గణిత పుస్తకం తీసుకొని రా మామయ్య' అని చివరగా మేనల్లుడు చెప్పాడని, సోమవారం పుస్తకం తీసుకొస్తానని చెప్పాన'ని మేనమామ కన్నీటి పర్యంతమయ్యారు.

29న ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధం సదస్సు

నీలగిరి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కమిటీ పేరుతో కాలయాపన చేయడాన్ని మానుకోవాలని ఎంఎస్పీ సీనియర్ నాయకుడు కందుకూరు సోమన్న మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్గొండలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నల్గొండలో నిర్వహించే ధర్మయుద్ధం సదస్సును విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, ప్రజా సంఘాల నాయకులు యాతాకుల రాజన్న మాదిగ, నల్ల చంద్రస్వామి మాదిగ, ఇరిగి శ్రీశైలం మాదిగ, వినయ్ మాదిగ, వెంకన్న మాదిగ, సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

నల్గొండ

•నల్గొండ • మునుగోడు • నకిరేకల్

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

నకిరేకల్, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న తమ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.81 లక్షలు మంజూరు చేయించారని కొత్తవారిగూడెం వాసులు హర్షం ప్రకటించారు. సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. చందుపట్ల పంచాయతీలో శివారుపల్లెగా ఉన్న తమ గ్రామం నుంచి సమీపంలోని బండపాలెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుతో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో కె.సంతోశ్‌రెడ్డి, ఎస్.రమేశ్‌రెడ్డి, రవీంద ర్‌రెడ్డి, కె.వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

నకిరేకల్: విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సోమవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని సంఘం ప్రచార కార్యదర్శి శివకోటి ఆంజనేయులుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరానికి విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆరోగ్య కార్డులతో హాజరు కావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రాక్‌హిల్స్‌కాలనీ న్యూ జనరేషన్ స్కూల్ ఎదురుగా మురుగు నీరు దిగువకు పారే అవకాశం లేక పోవడంతో ఇళ్ల మధ్యనే పేరుకుపోయాయి. అందులో పందులు, పశువులు పొర్లుతున్నాయి. దుర్వాసన వ్యాపిస్తోంది. కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

–సుధాకర్, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన నివారణ చర్యలు తీసుకుంటాం.

– నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

కాటమయ్య గుడి నిర్మాణానికి విరాళం

శాలిగౌరారం, న్యూస్‌టుడే: మండలంలోని తిర్మలరాయినిగూడెంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన కంట్ల మహేశ్వర స్వామి గుడి నిర్మాణానికిగాను భారాస రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కర్నాటి కృష్ణ, వడ్లకొండ నగేష్, సైదులు, భిక్షం, రామకృష్ణ, వెంకన్న, లింగయ్య, నాగయ్య, రవి పాల్గొన్నారు



తిర్మలరాయినిగూడెంలో గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న కిషన్‌రెడ్డి

లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధుల సాయం

నకిరేకల్: నిరుపేద కుటుంబాలకు చెందిన బాధితుల వైద్యం కోసం నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సాయాన్ని అందజేశారు. హైదరాబాద్ జిల్లెలగూడలో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న బాధితుడు శ్రీకాంత్‌చారికి రూ.20,200, మిర్యాలగూడ మండలం బొక్కముంతలపాడులో మెదడు సంబంధ సమస్యతో బాధపడుతున్న బాధితురాలు శ్రీదేవికి రూ.20,200 సాయాన్ని బాధితుల వద్దకు ఆదివారం వెళ్లి అందజేశామని ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు కర్నాటి నరేశ్ తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాల వారికి తమ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతినెలా రూ.200 చొప్పున జమచేసే నిధుల నుంచి బాధితులకు ఈ సాయాన్ని అందజేస్తున్నామని వివరించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత.. చిట్యాల గ్రామీణం: సుంకెనపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి శంకరయ్య కుమారుడు అవిశెట్టి వినేశ్(18) ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. శంకరయ్యతో పాటు పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా స్నేహితులంతా కలసి పోగుచేసిన రూ.లక్ష నగదును శంకరయ్యకు అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలెం మల్లేశ్, నందగిరి శ్యామ్, బాతరాజు రవీందర్, సురేశ్, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, వెంకటేశ్, సైదులు, మహేశ్, శంకర్, జానీ, నజీర్, శ్రీశైలం పాల్గొన్నారు.

చిట్యాల: శివనేనిగూడేనికి చెందిన నాగిళ్ల సుధాకర్ ఇటీవల మృతిచెందడంతో చిట్యాల జడ్పీ ఉన్నతపాఠశాలలో 2000-01లో ఆయనతో కలిసి చదువుకున్న మిత్రులు రూ.50,500 సొంతంగా పోగుచేసి సుధాకర్ కూతురు మైథిలి పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండును ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏళ్ల శ్రీశైలం, దగ్గుల యాదగిరి, తాడూరి మల్లేశ్, రమేశ్, మెండె సంతోశ్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండూరు ఫీల్డ్ అసిస్టెంట్ జర్పుల బిచ్చు నాయక్ కుటుంబానికి అతనితో పాటు 2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన మిత్రులు రూ.55 వేలు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. రాజేందర్, బాలాజీ, గణేశ్, హనుమంతు, ఉత్తరయ్య, సుమన్ ఉన్నారు. అదేవిధంగా ఆ గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకులు రూ.13 వేలు అందజేశారు.

గట్టుప్పల: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన 28 హైమాస్ట్ లైట్లను ఆదివారం మండల పరిధిలోని తేరట్‌పల్లిలో అందజేశారు. మాజీ సర్పంచి వీరమల్ల శ్రీశైలంగౌడ్, వీరయ్య, వెంకట రమణారెడ్డి, ఆంజనేయులు, ఇంద్రారెడ్డి, యాదయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విదేశీయులకు యోగా సాధన

నీలగిరి, న్యూస్‌టుడే:

ఆరోగ్యం కోసం యోగాసాధన ఆన్‌లైన్‌లో విదేశీయులు కూడా చేరుతున్నారు. అందరు ఆరోగ్యంగా ఉండటం కోసం యోగా మాస్టర్ నాగేశ్వర్‌రావు కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో యోగా పాఠాలు మొదలు పెట్టారు. కొందరు మిత్రులు చేరి నిత్యం యోగాసాధన తరగతులకు హాజరయ్యేవారు. యోగా సాధనతో ఆరోగ్యం బాగు చేసుకున్నవారు ఇంట్లో ఉంటూ ఆన్‌లైన్‌లో యోగా సాధనతో పాటు ధ్యానం భజనలు తదితర అంశాలను నేర్చుకుంటున్నారు. ఒకరి నుంచి ఒకరికి విస్తరించిన యోగా సాధన మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని వారే కాకుండా రష్యా, ఇండోనేషియా, నేపాల్, అమెరికా వంటి విదేశాల్లోని వారు సహితం ఆన్‌లైన్ సాధనలో భాగస్వాములు అవుతున్నారు. తాను నేర్చుకున్న యోగాతో అందరు ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో సత్యసాయి యోగా సేవా కేంద్రం ద్వారా నిత్యం సాధన శ్రీకారం చుట్టారు. యోగాతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ అప్పుడప్పుడు వారి కుటుంబ సభ్యులతో చర్చించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ నిత్యం ఎలా సాధన చేయాలో వివరిస్తూ సాధన చేయిస్తున్నారు.



ఆన్‌లైన్‌లో యోగా సాధన చేస్తున్న సాధకులు

ధ్యానంతో ఆరోగ్యంగా ఉన్నా... సురసి, ఇండోనేషియా



ఇండియా మిత్రుల ద్వారా యోగా గురించి తెలుసుకుని ఆన్‌లైన్ క్లాస్‌లో చేరాను. ఎంతో వత్తిడితో ఉన్న నేను ప్రస్తుతం ప్రశాంతంగా అన్ని పనులు చేసుకుంటున్నా. యోగా ధ్యానంతో తన సమస్యలు తొలగిపోయాయి. ఎన్ని పనులు ఉన్నా యోగా సాధనకోసం రోజు గంట కేటాయిస్తా. సమయం ఉన్న ప్రతిసారి ధ్యానం చేస్తాం.

నిద్ర సమస్య పోయింది..: సునీత



తనకు నిద్ర పట్టక ఎంతో ఇబ్బంది పడేదాన్ని. యోగా ఆన్‌లైన్ క్లాస్‌లో చేరాక యోగా సాధన ధ్యానంతో నిద్ర సమస్య పూర్తిగా పోయింది. నిత్యం యోగాసాధన క్లాస్‌లో పాల్గొంటా. ఆరోగ్యం గురించి గురువు చెప్పే ప్రతి విషయం పాటిస్తూ యోగా ధ్యానం సాధన చేస్తున్నాం

అందరి కోసం ఆన్‌లైన్‌లో తరగతులు..

నాగేశ్వర్‌రావు, యోగా గురువు



అంతా ఆరోగ్యంగా ఉండాలని తనకు అవకాశం ఉన్న సమయంలో యోగా సాధన నేర్పింస్తా. కరోనా సమయంలో ప్రత్యక్షంగా నేర్పించలేని పరిస్థితిలో ఆన్‌లైన్ తరగతులు తీసుకోవాలని చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 వరకు గంటసేపు యోగా ధ్యానం సాధన చేయిస్తా. ప్రతి రోజు అందరు రాకపోయినా అందుబాటులో ఉన్నవారికి నేర్పించడం ఆపను. నిత్యం యోగా సాధనతో పాటు ధ్యానం ప్రాధాన్యతను వివరిస్తా. మిత్రుల ద్వారా అనేక దేశాలకు చెందిన వారు కూడా ఆన్‌లైన్ తరగతులకు రావడం సంతోషంగా ఉంది.

సీపీఎం నేత చెరుపల్లికి పరామర్శ

చిట్యాల, న్యూస్‌టుడే: సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ దశదిన కర్మ చిట్యాలలో ఆదివారం జరిగింది. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంఎల్‌సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పల్లా వెంకట్‌రెడ్డి, నంద్యాల నరసింహారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, టి.జ్యోతి, తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, భారాస జిల్లా నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్, కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్, గర్దాసు బాలయ్య, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, సీపీఎం నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ జహంగీర్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెలికంటి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు లొడంగి శ్రవణ్‌కుమార్, చిట్యాల పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,వైస్ ఛైర్మన్ కూరెళ్ల లింగస్వామి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, మాటూరి బాలరాజు తదితరులు లక్ష్మమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు.



చిట్యాల: లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శాసనమండలి ఛైర్మన్ గుత్తా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, తదితరులు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అవసరం

నీలగిరి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను 2 శాతానికి కుదించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగ ఉపాధ్యాయ ఐకాస సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఐకాస సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ వల్ల అగ్రకులాలకు లాభం తప్ప బహుజనులకు ఒరిగిందిఏమిలేదని పేర్కొన్నారు. జనాభ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను 2 శాతానికి కుదించేవరకు పోరాడాలని నిర్ణయించారు. అన్ని అర్హతలున్న బహుజనులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనుల సత్తా చాటుదామని పేర్కొన్నారు. గ్రూప్-1కు సంబందిచిన జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఐకాస కమిటీ ఏర్పాటు కోసం సభ్యులను ఎన్నుకున్నారు. ఐకాస సభ్యులుగా కొంపెల్లి భిక్షపతి, వంగూరి నారాయణ యాదవ్, హోలీ నవీన్‌కుమార్, శంకర్‌గౌడ్, వేముల శేఖర్, సిరందాసు రామదాస్, కృష్ణకాంత్, ఎస్డీ అలీమ్, మండల ఆంజనేయులు, నాగయ్య తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో నిమ్మనగోటి జనార్థన్, కృష్ణయ్య, చంద్రం, మామిడి సైదులు, పందిరి గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఉద్యోగుల ఐకాస నాయకులు

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: వట్టిమర్తి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 27 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరితో మరొకరు గుర్తు చేసుకున్నారు. ఉన్నత స్థానాలను చేరుకున్న పూర్వవిద్యార్థులతో పాటుగా, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. భాస్కర్, పరమేశ్, నరేందర్‌రెడ్డి, రమేశ్, గోపాల్, మల్లేశ్, సత్యనారాయణ, సుఖేందర్‌రెడ్డి, సంధ్యారాణి, జయశ్రీ, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. భౌ...భౌ



గట్టుప్పల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను కరుస్తున్నాయి. దీంతో బాధితులు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వారంలో ఎనిమిది మంది కుక్క కాటుకు గురయ్యారు. వీరంతా మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న చండూరు వెళ్లి చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక శునకాలు మూగజీవాలను సైతం వదలడం లేదు. ఈ విషయంపై ఎంపీవో మాధవరెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ తీర్మానం

చిట్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దకాపర్తి, రామన్నపేట శివారులో ఏర్పాటు చేయనున్న సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం పెద్దకాపర్తి గ్రామస్తులు, అఖిలపక్షం నాయకులు తీర్మానం చేశారు. ప్రజల అనారోగ్యాలకు కారణమయ్యే, పంట పొలాలను నాశనం చేసే కాలుష్య కారక పరిశ్రమకు ప్రభుత్వం అనుమతులివ్వకూడదని పేర్కొంటూ నిరసన తెలిపారు. ఈ నెల 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందిమల్ల శిశుపాల్‌రెడ్డి, కాటం వెంకటేశం, మర్రి జలేందర్‌రెడ్డి, పొట్లపల్లి నర్సింహ, పొట్లపల్లి స్వామి, చేకూరి గణేశ్, లింగస్వామి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దకాపర్తిలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కోమటిరెడ్డి మాటలకు విలువ లేదు: కంచర్ల

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటలకు విలువ లేదని నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి సోదరులు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నియోజక వర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. తాము రూ.1,150 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. కోమటిరెడ్డి అనుచరులు సబ్‌స్టేషన్లలో పరికరాలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సాగర్ నీళ్ల ఖమ్మం పోతున్నాయే కానీ.. నల్గొండకు రావడం లేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు బూతులు మాట్లాడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మూసీకి కాలుష్యం లేకుండా నీళ్లను భారాస ప్రభుత్వమే అందించిందన్నారు.

ఎస్సైగా ఉద్యోగోన్నతి

తిప్పర్తి, న్యూస్‌టుడే: తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మిర్యాల దుర్గారెడ్డికి ఎస్సైగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన ఎస్సై శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. జిల్లాలో పోలీస్ కళాబృందం స్థాపనలో ఆయన ఒకరు. గ్రామాల్లో పోలీస్ కళాజాత బృందం సభ్యులతో కలిసి ప్రభుత్వం తరపున సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనేక పాటలు, కవితలు, సామాజిక అంశాలపై కథలు రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అనేక కళా ప్రదర్శనలు నిర్వహించారు.

చిత్తశుద్ధితో రైతు సంక్షేమం: నేతి

కేతేపల్లి,న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ చెప్పారు. కొండకిందిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి దోనాల సాయిరెడ్డి, రైతు ప్రతినిధులు అల్లి వెంకన్న, దొంతం అంజయ్య, ముక్కాముల వెంకన్న, గుండాల అంజయ్య, అల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



కొండకిందిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్

చిట్యాల గ్రామీణం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కాటం వెంకటేశం, డైరెక్టర్లు మురాల గోపయ్య, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, మామిడి శ్రీరాములు, గంగాపురం భాస్కర్, బోయపల్లి స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు... నకిరేకల్: నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేసేందుకు తన వంతు తోడ్పాటును అందిస్తానని శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ చెప్పారు. నకిరేకల్ పురపాలిక నూతన ఛైర్‌పర్సన్‌గా ఇటీవల ఎన్నికైన చౌగోని రజిత దంపతులు నేతి విద్యాసాగర్‌ను స్థానిక వీటీ కాలనీలోని ఆయన స్వగృహంతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ రజితను విద్యాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్రూరి వెంకటేశ్వర్లు, బీసీ సంఘాల ప్రతినిధులు తిరుగుడు రవియాదవ్, ఆకుల నాగయ్య, వేమారపు నర్సింహులు, పగిళ్ల వెంకన్న, మేడిపల్లి సైదులు, గోగికార్ పరమేశ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుపై భాజపా నిరసన

మునుగోడు, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద భాజపా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షులు జానయ్య, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సైదులు, బ్రహ్మచారి, క్రాంతికుమార్, మాజీద్, నర్సింహ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మూగజీవాల మృతి

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో అక్రమంగా తలిస్తున్న మూగ జీవలు మృతి చెందిన ఘటన నార్కట్‌పల్లిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కావడంతో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఒడిశా నుంచి ఎలాంటి అనుమతి లేకుండా 40 మూగజీవాలను తరలిస్తుండగా.. జాతీయ రహదారిపైన గోపలాయపల్లిలో గుర్తు తెలియని ఓ బస్సును వెనుక నుంచి ఢీ కొనడంతో 9 మూగ జీవాలు మృతి చెందాయి.

సంక్షిప్త సమాచారం

నూతన కార్యవర్గం ...

మర్రిగూడ: చరిత్రలో జ్ఞాపకాలు పదిలమై ఉన్నాయంటే అవి కేవలం ఛాయాచిత్రాలే కారణమని ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీసం సుందర్ అన్నారు. మండల కేంద్రంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ మండల నూతన కమిటీని ఆదివారం జిల్లా కార్యదర్శి బాకారం అశోక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీసం సుందర్, ప్రధాన కార్యదర్శిగా పాషా, కోశాధికారిగా నగేష్, ఉపాధ్యక్షులుగా రాంబాబు, కార్యదర్శిగా శేఖర్, మహిళా అధ్యక్షురాలిగా స్వప్న, సభ్యులుగా లక్ష్మయ్య, కిషోర్, సాయి, సుమన్, వినోద్, జగదీష్, దిలీప్, నర్సింహ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ... మునుగోడు: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గోలి సైదులు సమక్షంలో నూతన మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ముచ్చపోతుల శ్రీనివాస్, కోకన్వీనర్లుగా చీమల యాదగిరి, గోలి మారయ్య, కార్యవర్గ సభ్యులుగా మనోజు, రామలింగయ్య, యాదగిరి, రాజారామ్, బొల్లు సైదులు, ప్రవీణ్, రామకృష్ణ, బెల్లపు బాల శివరాజు, స్వామి, అద్దంకి పాపయ్యతో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

శాలిగౌరారం: మండలంలోని అడ్లూరుకు చెందిన బోడ అరుణ్‌కుమార్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా ఎస్సీసెల్ ఛైర్మన్ బోడ స్వామి అందజేసిన నియామక పత్రాన్ని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డిలు అరుణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు

ఎన్నిక... చిట్యాల గ్రామీణం: గుండ్రాంపల్లి గ్రామంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బొడిగె అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా మారగోని యాదయ్యగౌడ్, కార్యదర్శిగా బొడిగె రవీందర్‌గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్ మాట్లాడుతూ కల్లుగీత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మాజీ అధ్యక్షులు బొడిగె శెట్టి, కోయగూర నర్సింహా, నమ్ముల విజయ్, గోపగోని నర్సింహ, చెరుకు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి...

చండూరు: కల్లు గీత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గీత పని వారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శంకరయ్య గౌడ్ కోరారు. గీత పని వారల సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా చండూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం గీత కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. గంట రమేష్, యాదయ్య, వెంకటేశం, మల్లేషం పాల్గొన్నారు.

అన్నదానం... నకిరేకల్: నకిరేకల్ శివారులోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో స్థానిక చీమలగడ్డకు చెందిన సుభాశ్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో పేదల కోసం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి.నాగాచారి, ప్రతినిధులు టి.వెంకటేశ్వర్లు, పి.రామకృష్ణ, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ అల్తాఫ్ హుస్సేన్‌కు అభినందన... నల్గొండ టౌన్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ. అల్తాఫ్ హుస్సేన్‌ను ఆదివారం సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డా.బొమ్మరబోయిన కేశవులు కలిసి అభినందించారు. గతంలో వీసీగా ఆయన వర్సిటీకి చేసిన సేవలను కొనియాడారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, అంజిరెడ్డి, ప్రశాంతి, మధు, శ్రీహరి, దయాకర్, నవీన్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి... నల్గొండ జిల్లా పరిషత్తు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్థన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు యాదగిరి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు రవికుమార్, సాయికుమార్, రమేష్, శోభన్‌బాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** .విశ్వం, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో


నకిరేకల్: **రామకృష్ణ-** విశ్వం, **వెంకటేశ్వర-** దేవర

సంఘటితం కావాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: రాజకీయంగా ఎదిగేందుకు పద్మశాలీలు సంఘటితం కావాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ కోరారు. నకిరేకల్ పద్మశాలి భవన్‌లో సంఘం అనుబంధ కమిటీల ప్రమాణస్వీకారోత్సవంలో ఆదివారం మాట్లాడారు. నకిరేకల్‌లో మార్కండేయస్వామివారి ఆలయ నిర్మాణానికి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పెండెం ధనలక్ష్మి, సందానందం దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. నకిరేకల్ ప్రాంత పద్మశాలీలు కార్యవర్గాల ఎన్నికల్లో ఐక్యతను చాటారన్నారు. మార్కండేయ స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా పెండెం సదానందం, సామాజిక భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడుగా చిట్టిపోలు యాదగిరి, పంచాయతీ కమిటీ అధ్యక్షుడుగా సామల గౌరయ్య, ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడుగా చిట్టిపోలు పాండరితోపాటు కార్యవర్గ సభ్యులతో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నకిరేకల్ అధ్యక్షుడు మూడుదుడ్ల కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర నాయకులు దత్తగణేశం, రావిరాల మల్లయ్య, కాంగ్రెస్ నాయకుడు పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

భారాస ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో

శాలిగౌరారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం రైతుకు ఇవ్వాల్సిన భరోసాను ఇవ్వకుండా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ కేటీఆర్, గాదరి కిశోర్‌కుమార్ పిలుపు మేరకు శాలిగౌరారంలో భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిరేకల్-శాలిగౌరారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మామిడి సర్వయ్య, జేరుపోతుల చంద్రమౌళి, జి.శేఖర్‌బాబు, నతానియల్, నర్సయ్య, శ్రీరాములు, నర్సయ్య, రమేష్, అంజయ్య, వెంకన్న పాల్గొన్నారు



శాలిగౌరారం చౌరస్తాలో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

మర్రిగూడ: భారాస మేరకు మండల కేంద్రంలోని చౌరస్తాలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వల్లంల సంతోష్, శంకర్, జగన్, శేఖర్, రామన్న, శ్రీరామ్, రామకృష్ణ, యాదయ్య ఉన్నారు.

చండూరు: చండూరులో భారాస ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, నాయకులు గుర్రం వెంకట్‌రెడ్డి, అన్నెపర్తి శేఖర్, సతీష్‌గౌడ్, నాగరాజు, జానయ్య పాల్గొన్నారు.

నాంపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ శ్రేణులు ఆదివారం నిరసన చేశారు. మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ శేఖర్, నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారాస ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. ఆ పార్టీ నాయకులు పగిళ్ల సతీష్, బాలరాజు, శరత్‌బాబు, విజయ్, సురేష్, వెంకన్న, కరుణాకర్, సురేందర్ పాల్గొన్నారు.

గట్టుప్పల: మండల కేంద్రంలోని చౌరస్తాలో భారాస నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. మండల నాయకులు కైలాసం, సత్తయ్య, లక్ష్మయ్య, అంజయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ

14 గేట్ల ద్వారా టెయిల్‌పాండ్ నీటి విడుదల

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి టెయిల్‌పాండ్‌కు వరద నీటి రాక కొనసాగుతుండగా టెయిల్‌పాండ్ అధికారులు 14 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం ఎగువనున్న నాగార్జునసాగర్ జలాశయం నుంచి 2,31,778 క్యూసెక్కుల వరద వస్తుండగా టెయిల్‌పాండ్ అధికారులు 11 గేట్లను 3 మీటర్లు, 3 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి 2,36,813 క్యూసెక్కుల నీటిని దిగువనున్న పులిచింతలకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 75.36 మీటర్ల వద్ద ఉందని ప్రాజెక్ట్ ఏఈ జయపాల్ తెలిపారు.

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని హనుమాన్‌పేట సాయిబాబా దేవాలయం సమీపంలో ఖాళీ స్థలంలో వ్యర్థాలు భారీగా పేరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. – రఘు, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:

? హిల్‌కాలనీలోని రెండోవార్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు వచ్చి దుర్గంధంతో పాటు దోమలు ఎక్కువ కావడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. – సత్యనారాయణ, హిల్‌కాలనీ

✔ సిబ్బందితో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – శ్రీను, పుర కమిషనర్, నందికొండ

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. చిరువ్యాపారులు రోడ్డుపైనే తమ వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవడంతో సమస్య ఏర్పడుతుంది. ఆర్.చందర్, దేవరకొండ

✔ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య అదుపు కోసం ప్రతి నిత్యం పోలీసు వాహనం తిరుగుతూ ట్రాఫిక్‌ను అదుపు చేస్తుంది. హైవేపై సూచిక బోర్డులు నేషనల్ హైవే అథారిటి వారు ఇప్పటికే ఏర్పాటు చేశారు.. నర్సింహులు, సీఐ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ రాజశేఖర్‌రాజు కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

జనచైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బంగారుగడ్డ కేరళ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో షీటీమ్ ఎస్సై నరేష్, ఏఎస్ఐ విశ్వం, వ్యవస్థాపక అధ్యక్షుడు మునీర్, కృష్ణకాంత్, కిషోర్, కృష్ణ, షేక్ అహ్మద్, బాలాజీ పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు న్యాయం చేయాలి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ ఎఫ్‌సీఐలో కార్మికుల సంతకాల ఫోర్జరీ చేసి రూ.3కోట్ల నగదుతో పాటు 17 ఎకరాల భూమిని కాజేసిన నిందితులపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఐఎన్‌టీయూసీ




నిరసన వ్యక్తం చేస్తున్న ఎఫ్‌సీఐ హమాలీ కార్మికులు

అనుబంధ హమాలీ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ధనావత్ చిన్నపాండు కోరారు. ఆదివారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కో ఆపరేటివ్ సొసైటీలో హమాలీ కార్మిక సంఘం ప్రతినిధులు అధికారులతో కుమ్మక్కై ఆడిట్ లెక్కలు తప్పుగా చూపించారని ఆరోపించారు. బాలునాయక్, పాండు, సేవ, చంద్రయ్య, మహేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు ప్రతిపాదనలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, ఎస్టీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లు ఇతర పనుల కోసం ఇటీవలే అధికారులు ప్రతిపాదనలు పంపించారు. డివిజన్‌లోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 8 మండలాల్లో ఆయా ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, జైవీర్‌రెడ్డి ప్రతిపాదనల ఆధారంగా నూతన పనుల వివరాలను అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.



2 నియోజకవర్గాల పరిధిలో ప్రతిపాదనలు

26 కొత్త రహదారుల నిర్మాణానికి ₹ 51 కోట్ల అంచనా వ్యయం

బీటీ రోడ్ల మరమ్మతుల కోసం ₹ 153.55 కోట్లు

దీంతో మిర్యాలగూడ పరిధిలో సీఆర్ఆర్ ఎస్సీపీ కింద 17,116 మీటర్ల సీసీ రోడ్లకు ₹ 7.06 కోట్లు

30745 మీటర్ల పక్క కాల్వల నిర్మాణానికి ₹ 5.23 కోట్లు

మిర్యాలగూడ మండలం అవంతీపురం సమీపంలోని అటవీ ప్రాంత పరిధిలో పనులు నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన రహదారి

గతంలో టెండరు దశలో ఆగిన పనులు..

తిరస్కరణ

మిర్యాలగూడ నియోజకవర్గంలో 2021-22లో గ్రామీణ రోడ్ల నిర్వహణ కోసం రూ.7.55 కోట్ల పనులకు నేటివరకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో టెండరు దశలోనే నిలిచిపోయింది. 2022-23లో రూ.9కోట్లతో చేపట్టనున్న 16 పనులకు సైతం టెండర్లు రాలేదు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో రూ.4కోట్ల పనులకు టెండర్లు రాలేదు. 2022-23లో ఎస్టీ ఎస్డీఎఫ్ కింద గిరిజన ప్రాంతాల్లో 20 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.31కోట్లతో మంజూరైన పనులకు టెండర్లు రాక ఆగిపోయాయి.

అటవీ అనుమతులు రాక నిలిచినవి..

మిర్యాలగూడ మండల పరిధిలోని కాల్వపల్లి వంతెన నుంచి గూడూరు వరకు అవంతీపురం మీదుగా రెండు వరుసల బీటీ రోడ్డు పనులు 2022లో ప్రారంభం కాగా.. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో పలుచోట్ల నిలిచిపోయాయి. కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిని తాకుతూ.. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారికి చేరే ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మిర్యాలగూడ పట్టణంలోకి వెళ్లనవసరం లేకుండా రైస్‌మిల్లుల నుంచి నేరుగా రాష్ట్ర, జాతీయ రహదారులకు చేరే అవకాశం ఉంటుంది. అయితే కాల్వపల్లి నుంచి అవంతీపురం మధ్యలోని అటవీ ప్రాంతంలో 300 మీటర్లు, అవంతీపురం నుంచి గూడూరు మార్గంలోని అటవీ ప్రాంతంలో 2.5కిలోమీటర్లకు అటవీ అనుమతులు రావాల్సి ఉంది. మొత్తం రూ.13కోట్లతో పనులు చేపట్టగా..ప్రస్తుతం రూ.5కోట్ల పనులు పూర్తి కాగా..మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయి.

అనుమతులు రాగానే పనులు మొదలు: ఎం.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ, మిర్యాలగూడ



డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ నియోజకవర్గంలో ఐదు మండలాలు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మూడు మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పలు పనులకు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సూచనల మేరకు రెండు నెలల క్రితమే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

మిర్యాలగూడ పంచాయతీరాజ్ ఈఈ పరిధిలో కొత్త రోడ్ల ప్రతిపాదనల వివరాలు..

నియోజకవర్గం	మొత్తం పనులు	నిధుల అంచనా (రూ.కోట్లలో)
మిర్యాలగూడ	16	30.42
నాగార్జునసాగర్	10	20.54

డివిజన్ పరిధిలో బీటీ రోడ్ల మరమ్మతుల కోసం పంపిన ప్రతిపాదనలు..

నియోజకవర్గం	మొత్తం కిలోమీటర్లు	పనులు	నిధుల అంచనా (రూ.కోట్లలో)
మిర్యాలగూడ	73.94	24	21.77
నాగార్జునసాగర్	496.32	159	131.78

ముగిసిన క్రికెట్ పోటీలు

డిండి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో పదిహేను రోజులుగా డీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో 56 జట్టు తలపడ్డాయి. మొదటి బహుమతి పెద్దతండా జట్టు రూ.40 వేలు, కప్, ద్వితీయ బహుమతి దేవత్‌పల్లితండా జట్టు రూ.20 వేలు, కప్, తృతీయ బహుమతి డీసీసీ జట్టు రూ.10 వేలు, కప్ అందజేశారు. నిర్వాహకులు కలీం, సాయి, కాశన్న, ఏటీ కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, శైలేష్ పాల్గొన్నారు.

జెండావిష్కరణ

దేవరకొండ: కల్లు గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల హక్కుల సంక్షేమం కోసం ఏర్పాటైన గీత పనివారల సంఘం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఆ సంఘం జెండాను నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చింతపల్లి పుల్లయ్య ఆవిష్కరించారు. కుంభం జయరాములు, ఎం.డి.మైనొద్దీన్, గోవర్ధన్, సత్తయ్య, నారయ్య, పుల్లయ్య తదితరులున్నారు.



జెండావిష్కరిస్తున్న గీత పనివారల సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు పుల్లయ్య

సినిమాలు మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘువ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక

యాదవుల సమస్యలు పరిష్కరించండి

చింతపల్లి, న్యూస్‌టుడే: యాదవ కులస్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్ అన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 27న మండల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యాదవ సంఘం రాష్ట్ర నాయకులు సుధాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యులు జంగిటి నర్సింహ, శివర్ల రమేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీనివాస్, జగదీష్, రాములు, రాజు, శ్రీను, మల్లేష్, జంగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండల్

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు చికిత్స అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ నరాల వైద్యుడు గోపాలం శివన్నారాయణ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని 250 మంది రోగులకు పరీక్షలు, చికిత్స నిర్వహించారు. అనంతరం ఇటీవల నీటి పారుదల శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించిన గాలెంక అనుపమ ఆధ్వర్యంలో నాలుగు నెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జవివే రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాసచారి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరావు, నసీమా, మహిత పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దాత అనుపమ, జ.వి.వే. ప్రతినిధులు

ఘనం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌లోని న్యూకిడ్స్ స్కూల్‌లో పెద్దవూరలోని సిద్ధార్థ విద్యానికేతన విద్యాలయానికి చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా శాలువలతో సన్మానించారు. అనంతరం తమతో చదువకుని అకాల మృతి చెందిన ఎస్కే ఖాజా భార్యకు తాబేరాకు తమ వంతుగా ఆర్థిక సాయం చేశారు. రామాంజీరెడ్డి, శ్రీనివాసు, బాలకొండలు, ప్రభాకర్‌రెడ్డి, గౌస్, మోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్, శ్రీదేవి, సునితా, సరిత, జ్యోతి, చంద్రరమని, మంగమ్మ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

డిండికి కొనసాగుతున్న వరద

డిండి: ఎగువ ప్రాంతం నుంచి దుందుభివాగు ద్వారా డిండి జలాశయానికి ఆదివారం 8600 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. దీంతో డిండి జలాశయం స్పిల్‌వే మత్తడి, ఎడమ, కుడి కాల్వల ప్రధాన తూముల ద్వారా దిగువకు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ సాయికుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తోడ్పాటు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం కొప్పోలులో రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంటు నిర్వహిస్తే తమవంతు సహకారం అందిస్తామని మాజీ ఎంపీపీ చనమల్ల మాధవి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గాలి రవికుమార్ హామీ ఇచ్చారు. ఆదివారం ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీల ప్రారంభ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200పైగా క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంఈఓ యాదగిరి, సీనియర్ నాయకులు రాధాకృష్ణ, మాజీ సర్పంచి శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్నయాదవ్, నగేష్‌గౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మహ్మద్‌గౌస్, విజయ్, నారయ్య పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కుర్మేడ్, చింతపల్లి మండల కేంద్రాల్లోని మార్కెట్ యార్డులో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభిస్తారని సహకార సంఘం ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య తెలిపారు. గ్రామాల్లో వరి ధాన్యం సాగు చేసిన రైతులు నాణ్యమైన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి..!

❐ మూడు రోజుల తర్వాత వెలుగులోకి..

మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే: ఒంటరిగా ఇంట్లో ఉంటున్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన మిర్యాలగూడలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నాగయ్య(47), పారిజాతలకు 20 ఏళ్ల క్రితం వివాహం కాగా.. ఇద్దరి మధ్య మనస్పర్థలతో పదేళ్ల క్రితం భార్యభర్తలు విడిగా ఉంటున్నారు. పారిజాత కూతురితో కలిసి తన తల్లిదండ్రుల గ్రామం తుంగపాడులో నివాసం ఉంటుండగా.. ఒంటరిగా జీవిస్తున్న నాగయ్య.. మద్యానికి బానిసయ్యాడు. నాగయ్య ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు నందిపాడులో ఉంటున్న తల్లికి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. కుళ్లిన స్థితిలో నాగయ్య మృతదేహం కనపడింది. తీవ్ర అనారోగ్యంతో నాగయ్య మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని కంపసాగర్ సమీపంలో సాగర్ ఎడమకాల్వలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుంది. ఆమె కాళ్లకు కడియాలు, నీలం, నలుపు రంగుల దుస్తులు ధరించి ఉంది. కంపసాగర్ గ్రామ పంచాయతీ బిల్లు కలెక్టర్ అల్లాడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మరణోత్తర పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ వీరయ్య తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే త్రిపురారం, నిడమానూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

మిషన్ భగీరథ నీటి పైపులకు మరమ్మతులు

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రశాంతపురితండాలోని హరిచంద్రపురితండాకు నీటి పైపులు లీకేజీ కావడంతో మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచింది. నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శిని గ్రామస్థులు చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామానికి కేతావత్ కిషన్, బాణావత్ మల్లేష్ చొరవ తీసుకొని సొంత ఖర్చులు వెచ్చించి జేసీబీని ఏర్పాటు చేసి పనులు చేయించారు. నీటి సరఫరా కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రశాంతపురితండా సమీపంలో మరమ్మతులు చేస్తున్న కిషన్ నాయక్

నూతన కమిటీ నియామకం

హాలియా, న్యూస్‌టుడే: బీఎస్పీ నాగార్జునసాగర్ నియోజకవర్గం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రావులపాటి రవిశంకర్, బొల్లేపల్లి శంకర్‌లను నియమించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి కత్తుల కాన్షీరాం, అధ్యక్షుడు మామిడి సైదులు తెలిపారు. ఆదివారం హాలియా పార్టీ కార్యాలయం జిల్లా ఉపాధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎంపికైన నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జిల్లా శేఖర్, నిడమనూరు మండల అధ్యక్షుడు బషిపాక శివ నియామకమయ్యారు.



నియామకపత్రం అందజేస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మామిడి సైదులు, తక్కెళ్లపల్లి శ్రీను

విగ్రహం ఆవిష్కరణ

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలని తెలంగాణ గౌడ సంఘం మిర్యాలగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి జెరిపోతుల రాములు గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల సోమయ్యలు అన్నారు. మండలంలోని పాములపహాడ్‌లో గౌడ కుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య, ఎన్.శ్రీనివాస్, సైదులు, వెంకన్న, నరేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, కళింగరెడ్డి పాల్గొన్నారు.



పాములపహాడ్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సదస్సు జయప్రదం చేయండి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడలో వచ్చే నెల 3న నిర్వహించనున్న బీసీల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సదస్సుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంఘాల నాయకులు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, నేతి విద్యాసాగర్ తదితరులు హాజరు కానున్నారన్నారు. సైదులు, శ్రీనివాస్, అర్జున్, పరమేష్, కృష్ణయ్య, అశోక్, నాగార్జునచారి, మురళి, కవిత, జయరాజు, సత్యం పాల్గొన్నారు.

అవీ ఇవీ

విజయవంతం చేయాలి.. గుర్రంపోడు: నవంబరు 3న హైదరాబాద్‌లో జరుగనున్న ప్లీనరీని విజయవంతం చేయాలని ధర్మసమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిడి జగన్ కోరారు. ఆదివారం గుర్రంపోడులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్లీనరీ కరపత్రాన్ని ప్రదర్శించారు.

ఉచిత వైద్య శిబిరం.. తిరుమలగిరి సాగర్: మండలంలోని చింతలపాలెంలో హాలియా యశోద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు హర్షితరెడ్డి సుమారు 200 మందికి పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు.

ఆర్థిక సాయం.. మిర్యాలగూడ పట్టణం: ఇటీవల హాలియా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిడమనూరు మండలం బొక్కమంతులపాడుకు చెందిన గ్యార శివరాణికి వీబీఎన్ ఫౌండేషన్ ప్రతినిధులు భరత్‌రెడ్డి, వంశీ ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

నియామకం.. మిర్యాలగూడ: భారతీయ జనతా పార్టీ ఓబీసీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా మండలి సోములును నియమిస్తూ ఆదివారం పట్టణ అధ్యక్షుడు హన్మంతరెడ్డి నియామకపత్రం అందజేశారు.

చర్యలు తీసుకోవాలి.. మిర్యాలగూడ పట్టణం: విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీసేలా ఆదివారం సైతం తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల అనుమతులు రద్దు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని నారాయణ పాఠశాలలో నిరసన తెలిపి మాట్లాడారు. సుమన్, నగేష్, ప్రేమ్‌కిరణ్, తరుణ్, వెంకన్న, కార్తిక్ పాల్గొన్నారు.

వినతి.. మిర్యాలగూడ పట్టణం: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ విద్యానిధి పథకానికి అర్హుల సంఖ్యను 300 నుంచి 3వేల వరకు పెంచడంతో పాటు నిధులు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.

పరామర్శ.. హాలియా: మండలంలోని నాయుడుపాలెంకి చెందిన భారాస నాయకుడు పున్నయ్య కుమారుడు రామ్మోహన్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి నాయుడుపాలెంలో కందుల రామ్మోహన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గోడపత్రికలు విడుదల.. మాడ్గులపల్లి: ఈనెల 21, 22, 24 తేదీల్లో భద్రాచలం, కొత్తగూడెంలో జరిగే ఐద్వా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని పాములపహాడ్‌లో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధని గోడపత్రికలను విడుదల చేశారు. నాగమణి, ఇంద్రమ్మ, పద్మ, మంగమ్మ పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ విఫలం'



మిర్యాలగూడలో రైతుల నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి

త్రిపురారం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వానాకాలం రైతు భరోసా ఇవ్వనందుకు నిరసనగా భారాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రంలో నిరసన చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ మాజీ ఛైర్మన్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి, చారి, జానయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, దస్తగిరి, యాదయ్య పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో భారాస ఆధ్వర్యంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో భారాస సీనియర్ నాయకుడు ఆంజనేయులు నిర్వహించారు.

చందంపేట: భారాస మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, సత్యనారాయణ గౌడ్, బాలవర్ధిరాజు ఉన్నారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో భారాస నాయకులు నిరసన వ్యక్తం చేశారు. లింగారెడ్డి, దస్రూనాయక్, లింగం యాదవ్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

డిండి: డిండిలోని శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై భారాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శ్రీనయ్య, సురేష్, తిరుపతయ్య, లింగమయ్య, శ్రీను పాల్గొన్నారు.

పీఏపల్లి: కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై అంగడిపేట స్టేజీ వద్ద భారాస ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, సుధాకర్‌గౌడ్, మహేందర్, రామకృష్ణ, శ్రీను యాదవ్ తదితరులున్నారు.

పెద్దవూర: రాష్ట్ర భారాస పార్టీ పిలుపుమేరకు నిరసన చేసి రాస్తారోకో నిర్వహించారు. రవినాయక్ లింగయ్య, రవినాయక్, లక్ష్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.



దేవరకొండ పట్టణంలో..

తిరుమలగిరి సాగర్: భారాస మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. భిక్షనాయక్, హాతీరాం, శ్రీను, శంకర్, రవి, బగ్గు, యల్లయ్య, కోటి పాల్గొన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడులో నిరసన క్రమంలో పోలీసులకు భారాస కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. తిరుపతిరావు, వెంకటరెడ్డి, రాములు, రామారావు, సిరాజ్, శంకర్, గిరి, లింగయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడ: మిర్యాలగూడలో భారాస శ్రేణులు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి రైతులతో కలిసి నిరసన ర్యాలీ చేసి రాజీవ్ కూడలిలో మానవహారం జరిపి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

చింతపల్లి: భారాస ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, రవి, రాంరావు, ఖలేద్, శంకర్, యాదయ్య, పాపయ్య, బాల్‌సింగ్, మురళి, కృష్ణ పాల్గొన్నారు.

హాలియా: హాలియా ప్రధాన కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, యల్లయ్య, రాంబాబు, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.